జేబులో బొమ్మ!!

ఇంటి ఖర్చుకి ఎంత ఇచ్చినా భర్త జేబులో చెయ్యి పెడితేనే గాని తృప్తిగా ఉండదు ఆడవాళ్ళకి. "నా జేబు లోంచి ఏమైనా తీశావా?" అని ఆయనగారు అడగడం "చిల్లర కావలసి తీశానండీ" అని నిజమైన అబద్ధం ఒకటి యీావిడగారు చెప్పడం అదొక సరదా, అలవాటు! పోనీ ఒక జబ్బు!

యీా జబ్బుకి అతీతంగా లేదు పార్వతి ఆరోగ్యం రోజులాగే ఉదయంపూట కృష్ణమూర్తి జుబ్బా జేబులో చేయి పెట్టింది పార్వతి. పర్సు పైకి తీసింది. తీసిన మనిషి అలవాటుగా పర్సు తెరిచి యెదురుగా ఉండే తన ఫోటో కేసి చూడబోయింది. చేష్టలుడిగి అలాగే బొమ్మలాగా ఉండి పోయింది. అక్కడ తన ఫోటో లేదు. సరికదా, కనీసం కృష్ణ మూర్తి విజిటింగు కార్డు ఉన్నా ఏమైపోయేదోగాని అం దంగా నవ్వుతూ ఉన్న ఒక అమ్మాయి బొమ్మఉంది. ఆశ్చ ర్యం, విషాదం అలముకొన్న పార్వతి ముఖం క్షణంలో సగంలో రంగులు మారుస్తూంది. అందంగా నవ్వుతూన్న అమ్మాయి ముఖం తనకేసే చూస్తున్నట్టుంది. "కృష్ణమూర్తి

నా ఫోటో ఏం చేశాడు? యీ అమ్మాయి బొమ్మ ఇక్కడేం చేస్తోంది?" ప్రశ్నించుకుంది పార్వతి.

కల్గిన ఆశ్చర్యం షాక్‌గా తయారైంది పార్వతికి. ఇన్ని సంవత్సరాల వివాహంలోనూ అందమైన అమ్మాయిలు ఎదురైతే చూడకుండా కళ్ళుమూసుకోలేదు కృష్ణమూర్తి. కాని వ్యక్తిగతంగా వారితో సంబధబాంధవ్యాలు ఏర్పడలేదు అతనికి. అందాన్ని చూడకం, వ్యాఖ్యానించడం అతని హాబీ. అందుకే అంతంగా పట్టించుకోలేదు పార్వతి. బాధాపడలేదు. అడపా తడపా అతని ఉత్ప్రేక్షలు ఆమెలో అసూయను రేకెత్తించక పోలేదు. కాని అలా అందాన్ని మెచ్చుకోనడం అన్నది అందమైన, ఆరోగ్యవంతమైన మగవాడు చేయవలసిన పనిగా తోచిందామెకి. "కృష్ణమూర్తి లాంటి వాళ్లు గుడ్డిగా వూరుకున్నా బాగుండదు" అని పార్వతి నమ్మింది.

కృష్ణమూర్తి తనని మోసం చేస్తాడని గానీ, తనని కాదని తప్పుదారి తొక్కుతాడని గాని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. అయితేనేం గాక! పరాయి స్త్రీ బొమ్మకి అతని పర్సులో స్థానం ఏర్పడింది. "నాకు తెలిసి నాకు తప్ప ఇంకో స్త్రీకి అతని జీవితంలో చోటు లేదనుకున్నాను" అని వాపోయింది ఆ అమ్మాయి బొమ్మ చూస్తూ.

"తొలిరోజుల వలపు వేడిపోయి ఉండవచ్చు, కాని దాని స్థానే ప్రేమా, నమ్మకం, విశ్వాసం పెంపొందాయికదా? లేక పెంపొందాయని భ్రమపడ్డానా?" అనుకుంది ఎటునుంచి ఎటు ఆలోచించాలో అర్థంకాలేదు పార్వతికి.

గోడకున్న అద్దంలో తన ప్రతిబింబంపడి అదర

కొట్టింది పార్వతిని. అలసిన కళ్ళు, రేగిన జుట్టు, వెలిసి పోయిన చీర, అద్దంలో తన బొమ్మనీ పర్సులో అమ్మాయి బొమ్మనీ మార్చి మార్చి చూసింది పార్వతి. దుఃఖం, కోపం పెల్లుబికి వచ్చాయి. కోపంతో పర్సులో ఉన్న బొమ్మనుతీసి చిన్న చిన్న ముక్కలుగా చింపి పారేసింది. ఫోటో ఆల్బం లోంచి తనూ పిల్లలూ ఉన్న బొమ్మ ఒకటి తీసి పర్సులో పెట్టింది. "అద్దం నన్నుచూసి హేళన చేస్తూంది" అనుకుంది. "నే నేమిటి? మామూలు పెళ్ళాన్ని! ఇల్లాలిని! బుర్రలో యింటిగోడపలు తప్పించి వేరే లేనిదాన్ని, పిల్లల అవస రాలూ, భర్త అవసరాలూ తప్పించి మిగిలిన ప్రపంచం తెలియని దాన్ని! చాలీ చాలని డబ్బు, ఎప్పుడూ చాలేలా చాడాలనే తాపత్రయం తోనే నా పొద్దు గడిపేదాన్ని!" అనుకుంది పార్వతి.

అప్పుడప్పుడు కృష్ణమూర్తి అంటూనే ఉంటాడు "నీకు ఇల్లూ పిల్లలూ తప్పించి నా గొడవే లే"దని. "లేవని చెప్తాను" అనుకుని పర్సు యథాస్థానంలో పెట్టి ఇంటి పనిలో ప్రవేశించింది పార్వతి. ఏం చేస్తాను? ఏం చేయను? అన్ని ప్రశ్నలు చేస్తూన్న ప్రతి పనిలోనూ కనిపించి ప్రాణం విసి గించాయి. "ఆ ఫోటో ఎవరిది?" అని అడిగితే ఏమవుతుంది?

వంటింట్లో మోడామీద కూర్చుని ఆలోచనలోపడిన పార్వతికి నానిగాడూ, బాబిగాడూ కలిసి పళ్ళపొడి కోసం చేస్తున్న యుద్ధం వినిపించనూలేదు కనీసం కనుపించనూలేదు! "నెల మధ్యలో కృష్ణమూర్తి పర్సులోకి అంత డబ్బెలా వచ్చింది చెప్మా?" అన్న ఆలోచన వచ్చింది. పర్సులో డబ్బు

లెక్క పెట్టలేదు పార్వతి. కాని అది మామూలుకంటే ఎక్కువ బరువే ఉన్నట్టు జ్ఞాపకం వచ్చింది. "నాతో మాట వరుసకైనా అనకుండా అంత డబ్బు ఎప్పుడు తీసి ఉంటాడు కృష్ణమూర్తి?" అనుకుంది. "చిన్న చిన్న ఖర్చుకి సహితం వినుకాడతాను. అలాంటిది తన జల్సాల కింత డబ్బు తగ లేస్తాడా?" అనుకుని లేచింది పార్వతి. మళ్ళీ పడక గదిలోకి వెళ్ళింది. మంచంమీద కృష్ణమూర్తి అటునుంచి ఇటుతిరిగి పడుకున్నట్టుంది. వెనుక పక్కగా వెళ్ళి జుబ్బా జేబులోంచి పర్సుతీసింది. లెక్కపెట్టి ఐదు పది రూపాయల కాగితాలు తీసుకుంది. పర్సు జేబులోనూ, డబ్బు చీరల మడతల లోనూ పెట్టేసి తిరిగి వంటింట్లోకి వచ్చింది పార్వతి.

పొంగు వస్తున్నాయి. పాలు. స్థిరంగా దగ్గిరేనించుని పొంగు చూస్తూంది పార్వతి. "ఇలాంటి భర్తలని ఉట్టినే వదిలేయకూడదు. నేనూ చూస్తాను. నా కింత అన్యాయం తలపెడతాడా?" చూస్తూ ఉండగానే పాలు పొంగిపో యాయి. "అయ్యో" అనుకుని గబగబ గిన్నె కిందికి దింపింది.

కృష్ణమూర్తి తొమ్మిది దాటే వరకు లేవడు. లేచిన అరగంటలో ఆపీసుకి బయలుదేరి పోతాడు. యీ లోగా నే తనేం చేయాలో నిశ్చయించుకుంది పార్వతి. ముందుగదిలో నున్న ఫోను దగ్గిరకి వెళ్ళింది. తల్లిగారింటిపై వాటా వాళ్ళకి పోనుంది. అక్కడికే సాధారణంగా ఫోను చేస్తుంది. పార్వతి. నెమ్మదిగా ఫోను చేసింది. ఓ రెండు నిముషాలలోనే తల్లి గొంతు ఫోనులోవినిపించింది. ఒకపక్క ప్రాణం లేచివచ్చింది ఒక పక్క దుఃఖం పొంగివచ్చింది పార్వతికి.

"ఏమ్మా, ఇంత పొద్దున్నే ఫోను చేశావు? పిల్లలకి ఒంట్లో బాగులేదా?" ఆత్రుతతో అడిగింది పార్వతి తల్లి.

"బాగానే ఉందమ్మా, యీ రోజు సాయంత్రం అతనూ నేనూ బయటికి వెడదామని. పిల్లలని నీ దగ్గిర పొద్దున్నే దింపేస్తారు సరేనా? రాత్రి వచ్చేసరికి ఏడు అయి పోతుంది. పొద్దుటే వస్తాను." అంది పార్వతి.

"అలాగే దింపేయమను. అయినా శనాది వారాలే కదా రెండు పూటలు ఉంటారు. రెండు జతలబట్టలిచ్చి పంపు" అంది పార్వతి తల్లి.

"పెళ్ళి చేసుకునేదాకానే, తరువాత ఆ వివాహం సవ్యంగా ఉండాలంటే ఆడదాని చేతిలోనే ఉంది. గాజు గుళికలాంటి కాపురం చితికిపోయినా ఆడదానిదే తప్పు. ఎటు నుంచి ఎటువచ్చినా ఫలితాలు అనుభవించ వలసినదీ ఆడదే" అన్న నీతి పెళ్ళికి తొలి రోజే చెప్పింది పార్వతి తల్లి.

"కొంపలు కూల్చే సంగనాచిమీద యీ డబ్బు ఖర్చు చేయనిస్తానా?" అనుకుంది పార్వతి.

తొమ్మిదింటి కల్లా కాఫీ కప్పుతో కృష్ణమూర్తి పక్క ప్రత్యక్షం అయింది పార్వతి. "టైము పది దాటు తూంది" అంటూ లేపింది.

కళ్ళు తెరుస్తూనే భార్య అందమైన ముఖంచూసి కన్ను గీటాడు కృష్ణమూర్తి.

"ఎంత మోసగాడు! ఎంత నాటకం ఆడుతున్నాడు !" అనుకుంది పార్వతి.

"పిల్లలు లేచారా?" ఇల్లు నిశ్శబ్దంగా ఉన్నట్టు తోచి అడిగాడు కాఫీ కప్పు అందుకుంటూ.

"కోడి కూయడం మరిచి పోవచ్చుగాని నా కొడుకులు టైము తప్పరు" అంది పార్వతి.

"మరయితే గోల వినబడదేం?" అడిగాడు.

"పొద్దుటి నుంచీ వాళ్ళేం చేస్తున్నా పట్టించుకోలేదు. నాకు ఒంట్లో బాగుండలేదు." మంచం అంచున కూర్చుంటూ అంది.

"పోనీ మీా అమ్మగారిని రమ్మనలేక పోయావా?" పార్వతి చేయి తన చేతిలోకి తీసుకుని వేళ్ళు లెక్కపెట్టడం ప్రారంభించాడు. అది అతని అలవాటు. భార్యపట్ల సానుభూతి చూపెట్టే పద్ధతి. "ఆఫీసుపసంతా ఆ టైములోనే ఆలోచించుతుంటాను," అంటాడు.

"వీళ్ళనే అక్కడ దింపమంది. శని ఆది వారాలు అక్కడే ఉంటారంది" నిజమైన సంగనాచిలా అంది పార్వతి.

"గుడ్, మరా సంగతి చెప్పవేం! ఆఫీసుకు వెడుతూ పిల్లలని దింపేసి వెడతాను నువ్వేమో సాయంత్రం రడీగా వుండు ఎక్కడికేనా వెడదాం" భార్యని అమాంతం కౌగలించు కున్నాడు కృష్ణమూర్తి.

"మాట పొల్లు పోనివ్వడు. ఎంత జాగ్రత్త మనిషో" అనుకుంది పార్వతి

"నా వంట్లో బాగులేదని కదూ వాళ్ళని అమ్మమ్మ దగ్గిరకి పంపించడం?" కటువుగానే అంది.

"ఐసీ! మరిచేపోయాను. పోనీలే ఎవరినేనా స్నేహితు

లని పిలుద్దాం. ఇంట్లోనే సరదాగా కాలక్షేపం చేయవచ్చు." అన్నాడు ఒళ్లు విరుచుకుని లేస్తూ.

"బాగుంది వరస. నేనా కాఫీ కప్పులన్నీ కడగలేను!"

"పోనీ మనిద్దరమే వెచ్చగా కూర్చుందాం." భార్య చెంపపై ఓ క్షణం తన చెంప ఆన్చి బాత్‌రూంలోకి దారి తీశాడు కృష్ణమూర్తి.

"ఏం మనిషి?" అనుకుంది పార్వతి.

పిల్లలిద్దరికి చిన్న బాగ్‌లో రెండుజతల బట్టలు సర్దింది. వాళ్లు అమ్మమ్మ దగ్గిరికి వెళ్ళడానికి చూపుతున్న ఆత్రం చూసి, ఆశ్చర్యపడింది, కృష్ణమూర్తి అరగంటలో తెమిలి ఆఫీసుకి సిద్ధం అయాడు. పిల్లల్ని ఎక్కించుకుని బయలు దేరాడు. కారు స్టార్టు చేయబోతూ "నే త్వరగా వచ్చేస్తాను" అని హెచ్చరించాడు పార్వతిని.

భర్తా పిల్లలూ అటు వెళ్ళగానే ఇంటి పనిలో మునిగింది పార్వతి. పని ముగించి స్నానం చేసి శుభ్రమైన చీర కట్టుకుని బజారుకి బయలుదేరింది. ఏభయి రూపాయలూ పార్వతిని నిలువనీయడంలేదు. చక్కని జరీ చీర కొనుక్కుంది. దానికి తగ్గ జాకెట్టు బట్ట కొంది. ఇంటికి తిరిగివచ్చి భోజనం ముగించింది. తరవాత బోయిలర్ అంటించి ఓ అరగంట నిద్ర పోయింది. మధ్యాహ్నం లేచి తలంటుకుంది. నూకాలుతో చెప్పి మల్లెపూలు తెప్పించుకుని చక్కని దండ కట్టుకుంది. సాయంత్రానికి కృష్ణమూర్తి కిష్టమైన కాకరకాయకూర కూడా వండింది!

రోజూ సాయంత్రం ఏడుగంటల ప్రాంతాల ఇంటికి

వచ్చే కృష్ణమూర్తి ఏమన్నా రకల్లా తలుపు తట్టాడు ఎదురు చూడకుండా లభ్యం అయింది భార్యతో ఏకాంతం. ఆ అవకాశం అతనిలో కొత్త ఉత్సాహం రేకెత్తించింది. వీధితలుపు తెరచిన పార్వతిని చూసి వెన్నెలలా వికసించిందతని ముఖం. "ఓయ్! ఏమిటి సంగతి?" అన్నాడు కాలుతో తలుపు మూస్తూ పార్వతిని తన చేతుల్లోకి తీసుకుంటూ.

"ఏం లేదే!" అమాయకంగా అంది పార్వతి.

"ఎవరేనా వస్తున్నారా?" సాంబ్రాణి వాసనలు వెద జల్లుతూన్న పార్వతి జుట్టు వాసన చూస్తూ అడిగాడు.

"లేదే" అంది.

"మరేమిటి దంతా, నా కోసమే!" నమ్మలేనట్టు అన్నాడు.

"అనుకో" అంటూ అతని చేతిల్లోనుంచి తప్పించుకుని కాఫీకోసం లోపలికి నడిచింది పార్వతి.

కాఫీ కప్పు అందిస్తూ ఉంటే చూశాడు కొత్త చీర! పార్వతి మీాదనుంచి కళ్లు మళ్ళించుకోలేకుండా ఉన్నాడు.

వెళ్ళిపోతున్న పార్వతి "ఏయ్ యిలారా" ముద్దుగా పిలిచాడు.

"నే నేం గేదెనా? ఆవునా?" అంది.

"లేదు నా బానిసవి! ఇలారా" చెయ్యి పట్టుకున్నాడు కొంటెగా ఆమె ముఖంలోకి చూస్తూ "పోనీ వద్దంటే చెప్పు నీ స్వేచ్ఛ కొనుక్కుంటావా?" అడిగాడు.

"ఛోబ్బా! ఏమిటా మాటలు? నీ బానిసగా ఉండాలనేగా నా కోరిక" అంది పార్వతి.

"సరేగాని ఇలా వచ్చి కూచో" మంచం మీద తన పక్క స్థలం చూపించాడు కృష్ణమూర్తి.

ముద్దుగా కూర్చుంది పార్వతి.

"చీర ఎప్పుడు కొన్నావు? నేను చూడనే లేదే?" పాము కుబుసంలాగా ఉన్న చీర కొంగులో ముఖం దాచు కుంటూ అడిగాడు.

"కొత్తది" ముక్తసరిగా సమాధానం చెప్పింది పార్వతి.

"డబ్బెక్కడిదీ? ఇబ్బందిగా ఉంది అనుకున్నాంకదా?" అడిగాడు.

"ఇబ్బందిగా ఉందని నేను అనుకున్నాను. నువ్వేం అనుకున్నావు?" అతని కేసి సూటిగా చూస్తూ అడిగింది పార్వతి.

"నా దగ్గిర డబ్బు లేదని నీకు తెలియదా ఏం? అందు కేగా సాయంత్రం లేటయినా అప్పుడప్పుడు ఓవర్ టైము కూడా చేస్తున్నాను."

"ఎంత గట్టివాడు! పాత కథే ఎంతనమ్మేలా చెప్పు న్నాడు! ఏం చేతగాని నేను నమ్మకేం చేస్తానని! పోనీ" అను అంది పార్వతి.

"పోనీలే డబ్బుంటే ఏం, లేకుంటే ఏం. ఈ రోజు నువ్వు రంభ లాగా ఉన్నావు" మెల్లిగా జరిగి పార్వతి ఒడిలో తల పెట్టుకున్నాడు కృష్ణమూర్తి.

"పోనీలే. ఆమాత్రమేనా అనగలిగావు" కోపాన్ని అణచుకొంటూ అంది పార్వతి.

"ఈ రోజెందుకిలా ఉన్నావు?" నడుంమీద చేయి వేసి దగ్గిరికి లాక్కుంటూ అడిగాడు. "కోపం కూడా వచ్చినట్టుంది. నువ్వెంత దాచుకున్నా నీ కోపం దాగదని తెలుసా పార్వతీ" మొండిజాతి! ఈ నవ్వు ముఖం వెనకాల మోసాలు చేసే అసలు ముఖం ఉంటుందంటే కూడా ఎవ్వరూ నమ్మరు. ఏమనుకుని ఏం లాభం, అనుకుందో ఏమో అతని కౌగిట ఒదిగింది పార్వతి. పార్వతి ముఖాన్ని దగ్గిరికి తీసుకుని పెదవుల మీద సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు. ఆశ్చర్యం! పార్వతి తిరిగి ముద్దు పెట్టుకుంది. ఆవేశంగా ఆమెని గట్టిగా పొదివి పట్టుకున్నాడు. "పారూ ఎన్నాళ్ళయింది నువ్విలా నా దగ్గిరిగా వుండి?" అతని గొంతుకలో సున్నితమైనా మొరటు స్వరం ప్రవేశించింది. కళ్ళు వింతగా వెల్గుతున్నాయి. ఆ సమయం అందించిన సత్ఫలితాలని అందుకునే లోగానే హాల్లో ఫోను మ్రోగింది. పార్వతి లేచింది.

"నువ్వుండు నే వెడతాలే." అంటూ లేచాడు కృష్ణమూర్తి. మంచం మీద బొమ్మలా కూర్చుంది పార్వతి.

హాల్లోంచి కృష్ణమూర్తి చెప్తున్నవి కొంచెం కొంచెం వినిపిస్తున్నాయి. "ఉందోయ్. క్లబ్బులో నీ కుర్చీలో పడి వుంది. ఈ రోజు అఫీసుకి తెద్దామనుకుని మరిచిపోయాను రేపు ఉదయము తెస్తాలే." అంటూ ఫోను పెట్టేసి వస్తున్న కృష్ణమూర్తిని కన్నార్పకుండా చూస్తూంది పార్వతి.

"పెళ్ళిలో కూడా నువ్వలాగే చూశావు నాకేసి" అంటూ వచ్చి మంచం మీద కూర్చున్నాడు "రాధాయి ఫోను. నిన్న క్లబ్బులో కుర్చీలో పర్సు పారేసిపోయాడు.

ఈ రోజంతా దాని కోసం వెతికాడుట చూడు. రేపు ఆఫీసుకి వెళ్ళేముందు నిన్నటి జుబ్బా జేబులో పర్సు జ్ఞాపకం చెయ్యి...మంచి సమయంలో చేశాడు వెధవ ఫోను. రా పారూ" దగ్గిరికి తీసుకున్నాడు కృష్ణమూర్తి.

పర్సు...డబ్బు...బొమ్మ...ఇదే మాటలు శూలాల్లాగా పొడుస్తున్నాయి పార్వతిని భయంతో భర్త ముఖంలోకి చూసింది. అచేతనంగా ఉండిపోయిన పార్వతిని తనకేసి తిప్పుకున్నాడు కృష్ణమూర్తి. ముఖం ఎత్తి అతని కేసి చూడలేక అతని గుండెల్లో ముఖందాచేసుకుంది. అంతసేపూ అంత గంభీరంగా ఉన్న పార్వతి ఇలా ఎందుకైందో అర్థం కాలేదు కృష్ణమూర్తికి.

"ఏమైంది పారూ ఒంట్లో- నిజంగానే బాగులేదా?" ఆత్రంగా అడిగాడు.

"లేదు. లేదు. ఒంట్లో బాగానే ఉంది. మనస్సులోనే బాగులేదు." అంది వస్తున్న దుఃఖాన్ని అపుకొంటూ.

"నాతో కూడా చెప్పకూడదా?"

"చెప్పవచ్చు. కాని చెప్తే నవ్వకూడదు. కోపం అసలు తెచ్చుకోకూడదు" అంది పార్వతి.

"లేదు. కోపం రాదు. అసలు నవ్వను, చెప్పు."

"పొద్దుటే పర్సు తీశాను. ఎవతిదో ఫోటో పెట్టుకున్నావని చింపి పారేసి నా ఫోటో పెట్టాను. నన్నింతగా మోసం చేస్తున్నావని నీతో పోట్లాడటం చెప్పాలని ఈరోజు ప్లాను వేశాను.

అది ఇలా అయింది" సిగ్గుతో పార్వతి చెంపలు కంది పోయాయి. సన్నని నవ్వు కృష్ణమూర్తి పెదవుల మీద వెల్గింది. ఆవేశంగా భార్యని కౌగలించుకున్నాడు.

"పిచ్చి, నువ్వెందుకలా అనుకోవాలి? నా మీద నీ కింతేనా నమ్మకం ఉండట!" నవ్వుతూ ఆమె ముఖం పైకెత్తాడు. పోనీలే నేను రాధాయికి ఏదో సమాధానం చెప్పుకుంటా. కాని జలసీ నీలో తెచ్చిన మార్పు అమోఘం. నీవాడివని యింత హక్కు-కోసం పోరాడు తానేగాని నాకు మటుకు ఉండదా నువ్వు నా దానివని! అదెందుకు మరిచిపోతావు పార్వతీ?"

"ఇక అలా ఎప్పుడూ జరగదు కృష్ణా. నువ్వూ నేనూ ఒకరకం వాళ్ళమే. నిన్ను నేను మరిచిపోను. పిల్లల్లో, చేసే ప్రతి పనిలో నిన్నే చూసుకుంటాను. అందుకే ఆ పని అంత తృప్తిగా చేయకల్గుతున్నాను" అంది భర్త మెడ చుట్టూ చేతులు వేసి. "అదెందుకు నువ్వు తెలుసుకోవు?" అడిగింది.

"మైగాడ్! ఏం ఆడవాళ్ళు!" అనుకుని దగ్గిరైనా భార్య పెదవులు సున్నితంగా తాకాడు కృష్ణమూర్తి. డబ్బు పోతే పోయింది. ప్రియురాలు లాంటి భార్య దొరికింది. అంతే చాలు కొంతకాలం పాటు. అన్నాడు స్వగతంగా.

"మళ్ళీ ఇలాంటి పాడు ఆలోచనలు రానివ్వను. ఈ సారితో వాటికి స్వస్తి. నా కొత్తదనంమాసి పోనివ్వను" అనుకుంటూ పార్వతి భర్త కౌగిట ఒదిగింది.